
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 27 ఆగస్టు 2024



నేటి నుంచి రెండు కొత్త ఇసుక పాయింట్లు

కలెక్టరేట్, ఆగస్టు 26: జిల్లాలో మంగళవారం నుంచి మరో రెండు ఇసుక స్టాక్ పాయింట్లు ప్రారంభించనున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. 'గార మండలం శాలిహుండం, బూర్జ మండలం ఖండ్యాంలో ఇసుక స్టాక్ పాయింట్లు ప్రారంభిస్తాం. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శ్లాట్ బుకింగ్ ద్వారా రవాణాదారులకు ఇసుక కేటాయిస్తాం. శాలిహుండం, లంకాం మామిడివలస సచివాలయాల వద్ద బుకింగ్ స్లిప్స్ పొందాలి. రోజుకు ఒకరికి 20 టన్నులు మాత్రమే పరిమితి. ఏమైనా సమస్యలు ఉంటే 9701691657, టోల్‌ఫ్రీ 1800-425-6012 నెంబర్లను సంప్రదించాల'ని కలెక్టర్ సూచించారు.



ఎచ్చెర్ల: ఇస్కాన్ మందిరంలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

కృష్ణా.. ముకుందా!

- ఘనంగా శ్రీకృష్ణాష్టమి

(ఎచ్చెర్ల)

జిల్లాలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయాన్నే వివిధ ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. కృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కోలాట ప్రదర్శనలతో మహిళలు ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టేందుకు యువత పోటీపడ్డారు. పొన్నాడ కొండపై ఉన్న ఇస్కాన్ మందిరం(జగన్నాథాలయం)లో ఇస్కాన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీపతిదాస్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఉట్టికొట్టు సంబరంలో మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బొందిలీపురంలోని జగన్నాథస్వామి ఆలయంలో కూడా శ్రీకృష్ణుడ్ని ప్రత్యేకంగా అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.



బొందిలీపురంలోని జగన్నాథస్వామి ఆలయంలో..



ఎల్.ఎన్.పేట: వాడవలస సమీపంలో నీటమునిగిన పంట పొలాలు (ఫైల్)

ముంపు ముప్పు

- వర్షం వస్తే బిక్కుబిక్కుమంటూ గడపాల్సిందే
- కరకట్టల నిర్మాణం హామీలకే పరిమితం
- ఏళ్ల తరబడి పనుల్లో తీవ్రమైన జాప్యం
- వరద ఉధృతితో పంటలకు భారీ నష్టం
- భయాందోళనలో తీరప్రాంత వాసులు, రైతులు

(ఎల్.ఎన్.పేట)

వంశధార నదికి కుడివైపు కరకట్టల నిర్మాణం హామీలకే పరిమితమవుతోంది. నదీ తీరప్రాంతంతో పాటు లోతట్టు గ్రామాలకు, ఆయా గ్రామాల పరిధిలో రైతుల పంటలకు నష్టం వాటిల్లకుండా కరకట్టలు నిర్మించాల్సి ఉంది. కాగా.. ప్రభుత్వాలు మారుతున్నాయి. పాలకులు మారుతున్నారు. కానీ, కరకట్టల నిర్మాణం మాత్రం కలగానే మిగులుతోంది. దీంతో వంశధార నది పరీవాహక ప్రాంతాల్లోని వందలాది గ్రామాల పరిస్థితి దయనీయంగా మారింది. భారీ వర్షాలు కురిస్తే.. ప్రజలు రాత్రీపగలూ భయాందోళనతో బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుస్థితి నెలకొంది. వంశధార నదికి వచ్చిన వరదనీరు గ్రామాలకు ప్రవేశించి.. పొలాలన్నీ ముంపునకు గురై తీరని నష్టం వాటిల్లుతోంది. పొలల్లో ఇసుక మేటలు చేరగా.. వాటిని తొలగించేందుకు రైతులు ఆపసోపాలు పడుతున్నారు.

● 17 ఏళ్లుగా.. ఎదురుచూపులే..

వంశధార నదీ తీర గ్రామాలకు వరద ముంపు నుంచి తప్పించేందుకు 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కరకట్టల నిర్మాణాన్ని తెరపైకి తెచ్చింది. భామిని మండలం నుంచి పోలాకి మండలం వరకూ కరకట్టల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. భామిని నుంచి ఎల్.ఎన్.పేట వరకు ఫేజ్-1, సరుబుజ్జిలి నుంచి గార మండలం వరకు ఫేజ్-2 కింద విభజించి నిర్మాణ పనులు ప్రారంభించింది. అప్పట్లో రూ.600 కోట్లు కేటాయించినా.. నిర్మాణ పనులు సక్రమంగా సాగలేదు. భామిని, కొత్తూరు మండలాల్లో కొంతమేర కరకట్టల పనులు చేపట్టారు. తర్వాత నిధుల కొరత, ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో పనులు నిలిపేశారు. ఆ తర్వాత టీడీపీ హయాంలో 2019 జనవరి వరకూ మరికొంతమేర కరకట్టల నిర్మాణ పనులు చేపట్టారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. టీడీపీ హయాంలో చేపట్టిన 25 శాతంలోపు పనులను ప్రభుత్వం రద్దు చేసింది. ఈ క్రమంలో కరకట్టన నిర్మాణ పనులు కూడా నిలిపేసింది. దీంతో తీరప్రాంత వాసులు, రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. 17 ఏళ్లుగా ఎదురుచూపులే తప్ప.. ముంపు సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. ప్రస్తుతం ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కరకట్టల నిర్మాణ పనుల్లో కదలిక వస్తుందని తీరప్రాంత వాసులు, రైతులు భావిస్తున్నారు.

● భూ సేకరణ పూర్తయినా..

కరకట్టల నిర్మాణానికి సంబంధించి ఎల్.ఎన్.పేట మండలంలో స్కాట్‌పేట నుంచి మోదుగవలస, బసవరాజుపేట, లక్ష్మీనర్సుపేట, మిరియాపల్లి, వాడవలస, దబ్బపాడు, సుమంతాపురం గ్రామాల వరకు భూములను సేకరించారు. కొన్నిచోట్ల ఈ భూములను చదును చేశారు. దీంతో తమకు ముంపు సమస్య తప్పుతుందని పెద్దకోట, కోవిలాం, జంగాలవలస, చిట్టిమండలం, ధనుకువాడ, తురకపేట తదితర గ్రామాల ప్రజలు ఆనందించారు. అంతలోనే ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోవడంతో నిరాశ చెందుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే.. వంశధార నదిలో నీటి ఉధృతి తగ్గే వరకూ కొన్ని గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు ఉండవు. ఎల్.ఎన్.పేట మండలం దబ్బపాడు జలదిగ్బంధం అవుతుంది. తురకపేట, దబ్బపాడు గ్రామాల మధ్య ఉన్న కడపలగెడ్డరోడ్డుపై వరదనీరు ప్రవహించి.. వాహనాల రాకపోకలకు ఇబ్బందులే. దీంతో ఆ గ్రామస్థులు అత్యవసర సమయాల్లో వైద్యం కోసం పట్టణాలకు వెళ్లాలంటే వాడవలస, మిరియాపల్లి గ్రామాల మీదుగా సుమారు ఐదారు కిలోమీటర్లు దూరంలో ఉన్న లక్ష్మీనర్సుపేట జంక్షన్‌కు చేరుకోవాలి. ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న కడపలగెడ్డపై బ్రిడ్జి అయినా నిర్మించాలని స్థానికులు వేడుకుంటున్నా.. పట్టించుకునే నాథుడు లేడు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కరకట్టలు, వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాని కోరుతున్నారు.



తురకపేట, దబ్బపాడు గ్రామాల మధ్య కడపలగెడ్డపై ప్రవహిస్తున్న నీరు (ఫైల్)

ఏటా వరద ముంపు..



వర్షాకాలం వచ్చిందంటే ఏటా వరద ముంపు తప్పడం లేదు. అధిక పెట్టుబడితో వ్యవసాయం చేస్తున్నాం. ఖరీఫ్‌లో వరి పంట చేతికి అందివచ్చే సమయంలో వంశధార వరద కారణంగా ముంపునకు గురవుతోంది. తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కడపలగెడ్డపై బ్రిడ్జి నిర్మించక పోవడంతో వర్షాకాలమంతా రాకపోకలుండవు. ప్రభుత్వం స్పందించి కరకట్టలతోపాటు కడపలగెడ్డపై బ్రిడ్జి నిర్మించాలి.

-పల్లి సీతారాం, రైతు, దబ్బపాడు, ఎల్.ఎన్.పేట

కంటిమీద కునుకు వుండదు..



వర్షాకాలంలో వచ్చిందంటే చాలు.. వరదనీటి ముప్పుతో కంటిమీద కునుకు ఉండదు. ఏ సమయంలో వరద ముంచుకొస్తుందోనని భయాందోళతో కాలం గడుపుతాం. ఏటా వంశధార నదికి వచ్చే వరద ఉధృతి కారణంగా ఒడ్డు కొట్టుకుపోతుంది. నది ఒడ్డున ఉన్న మా గ్రామంలోకి నీరు ప్రవేశించడంతో నష్టం వాటిల్లుతోంది. మా కష్టాలను ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

-భాస్కరరావు, రైతు, వాడవలస, ఎల్.ఎన్.పేట

పరిష్కారం చూపాలి..



దశాబ్దాలు గడుస్తున్నా కరకట్టల నిర్మాణ పనులు చేపట్టడం లేదు. వరదల సమయంలో కరకట్టల నిర్మాణం చేపడతామని ప్రజా ప్రతినిధులు హామీ ఇస్తున్నారు. ఆపై విస్మరిస్తున్నారు. పాలకులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలి. లేదంటే ఈసారి ఎన్నికల్లో ప్రతిఘటన తప్పదు.

-ముగడ జనార్దనరావు, రైతు, ఎల్.ఎన్.పేట

భూసేకరణ పూర్తయింది..



ఎల్.ఎన్.పేట మండలంలో కరకట్టల నిర్మాణానికి సంబంధించి రైతుల నుంచి భూసేకరణ పూర్తయింది. రెవెన్యూశాఖ పరంగా ఇబ్బందులు లేవు. భూసేకరణ పూర్తయిన తరువాత సంబంధిత ఇంజినీరింగ్ విభాగం చూసుకుంటుంది. వరదల సమయంలో పంటలకు కలుగుతున్న నష్టాలను ప్రభుత్వానికి నివేదిస్తాం.

-వైవి. పద్మావతి, తహసీల్దార్, ఎల్.ఎన్.పేట



అంధవరం వద్ద కోతకు గురవుతున్న వంశధార నది గట్టు

'వంశధార'కు కోత..

- గ్రోయిన్లు లేక ఇబ్బందులు

(జలుమూరు)

వంశధార నదికి సరైన గ్రోయిన్లు లేక నది గట్టు కోతకు గురై పంట పొలాలు దెబ్బతింటున్నాయి. ఒడిశాలో భారీ వర్షాలు కురిస్తే.. వంశధార నదికి వరద నీరు పోటెత్తి గ్రామాల్లోకి ప్రవేశిస్తుంది. తద్వారా ఎటువంటి నష్టం వాటిల్లుతుందోనని తీరప్రాంత వాసులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తారు. వంశధార నదికి వరదనీరు వస్తే.. జలుమూరు మండలంలోని అంధవరం, ఉప్పరపేట, సురవరం ప్రాంతాల్లో నది గట్లు కోతకు గురై పొలాలు ముంపునకు గురవుతున్నాయి. అంధవరం, ఉప్పరపేటల వద్ద అధికారులు గ్రోయిన్లు నిర్మించారు. కానీ వరదల సమయంలో ఈ గ్రోయిన్లు వంశధార నదిగట్టు కోతకు గురవకుండా నిలువరించలేకపోతున్నాయి. వంశధారకు వరద వచ్చినప్పుడు ముంపు ముప్పు నుంచి కాపాడేందుకు.. జలుమూరు మండలం కరకవలస నుంచి పోలాకి మండలం పల్లిపేట వరకు 52 కిలోమీటర్లు పొడవునా కరకట్టల నిర్మాణానికి పదేళ్ల కిందట శ్రీకారం చుట్టారు. అప్పట్లో ప్రభుత్వం రూ.56 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో కరకవలస నుంచి శ్రీముఖలింగం, నగిరికట కం, అచ్యుతాపురం వరకు కరకట్టలు పనులు చేపట్టారు. తర్వాత నిధులు లేక పనులు నిలిపేశారు. దీంతో వంశధారకు వరద వస్తే.. నగిరికటకం, అచ్యుతాపురం, కొమనాపల్లి, మాకివలస, లింగన్నాయుడుపేట, పర్లాం, అందవరం, ఉప్పరపేట గ్రామాల వాసులకు ముంపు సమస్య తప్ప దం లేదు. ఉప్పరపేట వంశధారనది తీరంలోనే ఉన్నందున.. భారీ వర్షం కురి స్తే.. గ్రామంలోకి వరదనీరు చొరబడుతుంది. ఆ సమయంలో స్థానికు లు గ్రామాన్ని వీడి.. సమీపంలో ఉన్న అంధవరం, రామకృష్ణాపురం గ్రామాల్లోకి వెళ్లి తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కరకట్టలు పనులు పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

పారదర్శకంగా బదిలీల ప్రక్రియ

- మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై అధ్యయనం
- మంత్రి అచ్చెన్నాయుడు



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్న

టెక్కలి, ఆగస్టు 26: అధికారుల బదిలీల ప్రకియ పారదర్శకంగా చేపడుతున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. బదిలీల విషయమై ఎవరికైనా డబ్బులిచ్చినా.. తీసుకున్నా బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం టెక్కలిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. చిన్న అటెండర్ నుంచి పెద్దపెద్ద పోస్టుల వరకూ అవినీతికి ఆస్కారం లేకుండా బదిలీల ప్రక్రియ న్యాయబద్ధంగా చేపడుతున్నామని తెలిపారు. అంకితభావంతో పనిచేసి మీ అందరి గౌరవాన్ని పెంచేలా పాలన సాగిస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

● మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో అధికారులు అధ్యయనం చేస్తున్నారు. అక్కడ ఏవైనా లోపాలు ఉంటే.. వాటిని అధిగమించి అమలు చేయాలన్నది కూటమి ప్రభుత్వ నిర్ణయం. దీనిపై సీఎం చంద్రబాబు నాయకత్వంలో కేబినెట్‌లో చర్చించి.. మహిళలకు వీలైనంత తొందరగా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామ'ని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు రూ.20వేల పెట్టుబడి సాయం, ప్రతినెల 1వ తేదీ నాటికి ఉద్యోగులకు, పింఛన్ దారులకు జీతాలు అందజేస్తామన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వ్యవస్థలన్నీ ఛిన్నాభిన్నం చేసిందని విమర్శించారు. ప్రస్తుత తమ కూటమి ప్రభుత్వం అవన్నీ సరిదిద్ది.. ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని తెలిపారు. సమావేశంలో కింజరాపు ప్రసాద్, టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి మండల పార్టీల అధ్యక్షులు బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, బోయిన రమేష్, వెలమల కామేశ్వరరావు, ఎల్.ఎల్.నాయుడు, చాపర గణపతి ఉన్నారు.

మొగలి పరిమళాలేవీ?

- జిల్లాలో తగ్గిన సాగు విస్తీర్ణం
- తుఫాన్లతో నేలకొరుగుతున్న చెట్లు
- ఉపాధికి దూరవుతున్న రైతులు

(ఇచ్ఛాపురం)



డొంకూరులో మొగలి తోట

జిల్లాలో మొగలి సాగు గణనీయంగా తగ్గుతోంది. తీర ప్రాంతాల్లో ఈ పంట విస్తారంగా ఉండేది. కానీ విపత్తులతో మొగలి చెట్లు నేల కొరుగుతూ.. పంట కనుమరుగు అవుతోంది. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు, పలాస, సంతబొమ్మాళి, శ్రీకాకుళం రూరల్, గార మండలాల్లో సుమారు 6వేల హెక్టారుల్లో మొగలి సాగవుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఉద్దానంలో కొబ్బరి అంతర పంటగా దీనిని సాగు చేస్తున్నారు. పొలాలకు కంచె వేసే క్రమంలో వీటిని నాటుతారు. ఇవి క్రమేపీ పెరుగుతుంటాయి. పొలం గట్లతోపాటు తీర ప్రాంతానికి ఈ చెట్లు రక్షణ కవచంలా ఉంటాయి. కాగా తుఫాన్ల సమయంలో ఇవి నేలకొరుగుతున్నాయి. ప్రభుత్వం పంటల జాబితాలో చేర్చకపోవడంతో వీటికి పరిహారం దక్కడం లేదని రైతులు వాపోతున్నారు.

● మూతపడుతున్న బట్టీలు..

ఉద్దానంలో మొగలిపువ్వులు ఎక్కువగా సేకరిస్తుంటారు. అత్తరు, సుగంధద్రవ్యాల తయారీలో మొగలిపువ్వును వినియోగిస్తారు. ఉద్దానంలో గతంలో మొగలి నుంచి రసాయనం తీసే పరిశ్రమలు వెలిశాయి. వందలాది మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందేవారు. బట్టీలుగా పిలుచుకునే పరిశ్రమల వద్ద భారీ రాగిపాత్రలో మొగలి పూలను మరిగించి ఆవిరి రూపంలో రసాన్ని తీస్తారు. ఈ రసాన్ని మరో రాగిపాత్రలో నిల్వ చేసి విదేశాలకు విక్రయిస్తుంటారు. దీంతోనే అత్తరు, సుగంధ ద్రవ్యాలను తయారుచేస్తుంటారు. అయితే పండించే రైతులు, సేకరించే కార్మికులు, రసాన్ని తయారు చేసే బట్టీ నిర్వాహకుల కంటే.. సుగంధ ద్రవ్యాలు తయారు చేసే పరిశ్రమల యాజమాన్యాలకే మొగలి పువ్వులు కాసులు కురిపిస్తున్నాయి.

● సేకరణ కష్టం..

ఏడాదిలో ఆరు నెలల పాటు మొగలి పువ్వులు కాస్తాయి. ఏటా జూన్ నుంచి డిసెంబరు వరకూ వీటిని ఎక్కువగా సేకరిస్తారు. ఒక్కో చెట్టు వందల్లో పూలను పూస్తుంది. ఒక్కో పువ్వు రూ.10 నుంచి రూ.12 వరకూ పలుకుతుంది. అయితే మొగలిపువ్వుల సేకరణ కత్తిమీద సాము. చెట్టుకొమ్మన పువ్వు కాస్తుంది. మొగలిచెట్లు గుబురుగా ఉంటుంది. పైగా ఆకులకు ముళ్లు ఉంటాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న రంపం మాదిరిగా దాని ముళ్లు కోస్తాయి. దీనికితోడు మొగలి చెట్లపై పాములు అధికంగా ఉంటాయి. మరోవైపు గుబురుగా ఉండే మొగలిచెట్ల మధ్య ఎలుగుబంట్లు సేదదీరుతుంటాయి. ఇన్ని ప్రమాదాల మధ్య మొగలి పువ్వులు సేకరించినా ఆశించిన స్థాయిలో గిట్టుబాటు కావడం లేదు. వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధినిస్తున్న మొగలిని వాణిజ్య పంటగా గుర్తించాలని రైతులు, కార్మికులు కోరుతున్నారు.

విపత్తులతో నష్టం

ఏటా విపత్తులతో మొగలి చెట్లు నేలకొరుగుతున్నాయి. గతంలో తీర ప్రాంతంలో మొగలి చెట్లు గుబురుగా కనిపించేవి. కానీ తితలీ తుఫాన్‌తో మొత్తం చెట్లు కొట్టుకుపోయాయి. దీంతో కనీసస్థాయిలో కూడా ఇప్పుడు సేకరణ జరగడం లేదు. గిట్టుబాటు కావడం లేదు. అందుకే ఎక్కువ మంది ప్రత్యామ్నాయ ఉపాధి వైపు మళ్లారు.

- దున్న జానకిరావు, మొగలి రైతు, డొంకూరు

మార్కెట్ సదుపాయం కల్పించాలి

మొగలిని వాణిజ్య పంటగా గుర్తించాలి. అన్ని పంటలు మాదిరిగా బీమా, పరిహారం అందేలా చూడాలి. మార్కెటింగ్, రవాణా సదుపాయం కల్పించాలి. ప్రభుత్వమే ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి. స్వయంగా కొనుగోలు చేసి ప్రోత్సహించాలి.

- పి.రామారావు, రైతు, పెద్ద లక్ష్మీపురం

తరిగిపోతున్న.. అనంత'గిరి'!

- రాత్రివేళల్లో కొండపై అక్రమ తవ్వకాలు

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 26: చుట్టూ ఎత్తయిన కొండలు.. పచ్చని చెట్లతో ఒకప్పుడు ఎంతో ఆహ్లాదంగా ఉండే అనంతగిరి గ్రామం కళావిహీనంగా మారింది. కొంతమంది అక్రమార్కులు రాత్రివేళల్లో కొండలను తవ్వేసి.. యథేచ్ఛగా కంకర, రాళ్ల విక్రయాలు సాగిస్తున్నారు. రూ.లక్షల్లో అక్రమార్జన పొందుతున్నారు. వజ్రపుకొత్తూరు మండల కేంద్రానికి సుదూరంలో ఈ పంచాయతీ ఉండడంతో.. ఇక్కడ కొండలు తరిగిపోతున్నా అక్రమార్కులపై అధికారులు చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి. వైసీపీ పాలనలో భారీగా కొండపై కంకర తవ్వకాలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని రోజులు తవ్వకాలు నిలిపేశారు. మళ్లీ గత వారం రోజులుగా రాత్రివేళల్లో యంత్రాలతో కొండలను తవ్వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. విలువైన ప్రకృతి సంపద కరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై వీఆర్వో జగదీశ్వరి వద్ద ప్రస్తావించగా.. కొండలపై తవ్వకాలను పరిశీలించి.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



తవ్వకాలతో చదునుగా మారిన అనంతగిరి కొండ

ఉమ్మడి పౌరస్మృతి 'ఒకే దేశం - ఒకే చట్టం'

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం



(నిన్నటి దిక్సూచి తరువాయి)

ఉమ్మడి పౌరస్మృతి-చారిత్రక పరిణామం
(రాజ్యాంగ పరిషత్ నుంచి 17వ లోక్‌సభ వరకు)

★ ఉమ్మడి పౌరస్మృతి అనే అంశం మన దేశానికి స్వాతంత్ర్యం రాకముం దు నుంచే చర్చనీయాంశంగా ఉంది. ఆనాటి కాలంలో హిందూ మహిళలకు విడాకులు తీసుకునే హక్కు ఉండేది కాదు. దాంతో ఉమ్మడి పౌరస్మృతి తేవాలనే డిమాండ్ తొలుత అఖిలభారత మహిళా కాన్ఫరెన్స్ నుంచి వచ్చింది. దీంతో రాజ్యాంగ కమిటీ విస్తృతంగా చర్చించింది. రాజ్యాంగ నిర్ణయసభలో సభ్యునిగా ఉన్న నజీరుద్దిన్ అహ్మద్ ఉమ్మడి పౌరస్మృతి కోసం డిమాండ్ చేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలోని సబ్ కమిటీ ఉమ్మడి పౌరస్మృతిని ప్రాథమిక హక్కుల్లో చేర్చాలా వద్దా అనే అంశంపై ఓటింగ్ నిర్వహించింది. 5-4 ఓట్ల తేడాతో అది వీగిపోయింది. దాంతో ఉమ్మడి పౌరస్మృతిని ప్రాథమిక హక్కులకు బదులుగా ఆదేశిక సూత్రాల్లో చేర్చారు. తదనంతర కాలంలో నెహ్రూ 'ఆధునిక పౌరస్మృతి' పేరిట కొత్త చట్టం తేవాలని ప్రయత్నించారు. కొన్ని వర్గాలు వ్యతిరేకించడంతో ఈ ప్రయత్నమూ ముందుకు సాగలేదు. 1964లో 'ముస్లిం పర్సనల్ లా'పై ఢిల్లీలో ఒక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొని విస్తృతంగా చర్చించారు. ఉమ్మడి పౌరస్మృతి అమలుకే మెజార్టీ సభ్యులు మొగ్గు చూపారు. మరోవైపు 1985లో షాబానో, 1995లో సరళా ముద్గల్ కేసుల్లో యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ)ను అమలు చేయాల్సిన అవసరం ఉన్నదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

★ ఇదే అంశంపై 2018లో 21వ లా కమిషన్ ఒక నివేదికను సమర్పించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఉమ్మడి పౌరస్మృతి అవసరం లేదని ఆ నివేదికలో పేర్కొంది. మరోవైపు 2023 జూలై 3న పార్లమెంటరీ కమిటీ చైర్మన్ సుశీల్ మోదీ యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ) నుంచి గిరిజన తెగలను మినహాయించాలని సిఫార్సు చేశారు. ప్రస్తుతం 22వ లా కమిషన్ దీనిపై అధ్యయనం కొనసాగిస్తుంది.

★ ఈ విధంగా ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించి అనేక చర్చలు, వాదోపవాదాలు ముందుకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మన రాజ్యాంగంలోని నిబంధనలు ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించి ఏం చెబుతున్నాయనే ఆసక్తి సహజంగానే అందరిలో కలుగుతుంది. ఇందుకు సామాజిక, రాజకీయ ఆసక్తులు ప్రధా న కారణం కావచ్చు. లేదా అనేక సందర్భాల్లో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు మరో కారణం కావచ్చు. 22వ లా కమిషన్ ఈ అంశంపై విస్తృత అధ్యయనం చేస్తుండడంతో... గతంలో 21వ లా కమిషన్ చెప్పిన దానికి భిన్నంగా ప్రకటించే అవకాశముందా అనే సంశయం; ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉమ్మడి పౌరస్మృతిపై చేసిన చట్టం రాజ్యాంగంలోని 44వ ఆర్టికల్‌పై దృష్టి సారించేలా చేసింది.

★ **ఆర్టికల్ 44:** 'The state shall endeavour to secure the citizen a uniform civil code through the territory of India'. దీని అర్థం 'భారతదేశంలోని పౌరులందరికీ ఒకేవిధమైన పౌరస్మృతిని తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నించాలి. ఇక్కడ మనం గుర్తించాల్సింది ఏమంటే ఈ వ్యాఖ్యల్లో యూనిఫాం(ఒకేవిధమైన) అనే పదం ఉంది. కామన్(ఉమ్మడి) అనే పదం లేదు. ఇండీవియర్- ప్రయత్నం, షల్ సెక్యూర్ అని కాకుండా 'షల్ ఇండీవియర్ టు సెక్యూర్' ఉండటాన్ని మనం గమనించాలి.

★ వ్యక్తిగత జీవితంలో అనుసరించాల్సిన ధర్మాల గురించి అన్ని మతాలు పేర్కొంటున్నాయి. ఆ మేరకు వ్యక్తిగత చట్టాలనూ అవి రూపొందించుకుంటున్నాయి. వీటిలో వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత, పిల్లల సంరక్షణ గురించిన చట్టాలు ముఖ్యమైనవి. భారతీయ సమాజంలో ఉన్న భిన్న రీతుల నేపథ్యంలో భిన్న వ్యక్తిగత చట్టాలు రూపుదిద్దుకున్నాయి. వీటితో పాటు నాగరిక జీవనానికి దూరంగా ఉన్న ఆదివాసి(గిరిజనులు)ల సాంస్కృతిక, సామాజిక జీవనానికి నష్టం కలగని రీతిలో తీసుకొచ్చిన ప్రత్యేక చట్టాలు కూడా ఉన్నాయి. మరోవైపు గిరిజన ప్రాంతాల పరిపాలన నిమిత్తం రాజ్యాంగంలోని 5వ, 6వ షెడ్యూళ్లలో కొన్ని అంశాలను ప్రస్తావించారు. వీటి ప్రకారం ప్రత్యేక ప్రాంతాల్లో నివసించే గిరిజనుల వివాహ, విడాకుల, వారసత్వం... వంటి సాంఘిక ఆచారాలపై చట్టాలు చేసే అధికారాలను ఆయా జిల్లా మండళ్లు, ప్రాంతీయ మండళ్లకు కల్పించారు. అదే విధంగా గిరిజనుల మత, సాంఘిక, ఆచార, కట్టుబాట్ల విషయంలో నాగాలాండ్‌కు సంబంధించి ఆర్టికల్ 371ఏను, సిక్కింకు సంబంధించి ఆర్టికల్ 371ఎఫ్, మిజోరాంకు సంబంధించి 371జీను మన రాజ్యాంగంలో ప్రత్యేకంగా చేర్చారు.

★ ఈ సందర్భంగా ఇక్కడ మరో విషయాన్ని కూడా చెప్పుకోవాలి. అమలులో ఉన్న 'హిందూ మ్యారేజెస్ యాక్ట్ 1955; హిందూ సక్సేషన్, మైనారిటీస్, గార్డియన్‌షిప్ యాక్ట్ 1956; అడాప్షన్స్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్ 1956ల్లోని కొన్ని నిబంధనలను మార్చాల్సిన అవసరం ఉందని కొంత మంది పేర్కొంటున్నారు. ఉదాహరణకు కొడుకులతో సమానంగా కుమార్తెలకు సమాన ఆస్తిహక్కులు కల్పించడం, గృహహింస నుంచి మహిళలకు రక్షణ చట్టం(2005); బాల్య వివాహాల రద్దు చట్టం(2006); తల్లిదండ్రుల సీనియర్ పౌరుల పోషణ చట్టం(2007) అనే మూడు వ్యక్తిగత చట్టాలను సవరించడం ఆహ్వానించదగ్గ విషయం. ఇంకా మరికొన్ని వ్యక్తిగత చట్టాలకు సవరణలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. అయితే భారతదేశ వైవిధ్య సంస్కృతిని కాపాడుకుంటూ వ్యక్తిగత చట్టాలను సవరించాలి.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్

దిక్సూచి

ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజంలో కోర్సులు

హైదరాబాద్‌లోని ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం(ఏపీసీజే)- వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు ఉన్నాయి. రెగ్యులర్, దూరవిద్య విధానాల్లో కోర్సులు చేయవచ్చు. ఆన్‌లైన్ మోడ్‌లో తరగతులు నిర్వహిస్తారు. తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాలు ఎంచుకోవచ్చు.

పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం: కోర్సు వ్యవధి ఏడాది. డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ జర్నలిజం: కోర్సు వ్యవధి ఆర్నెల్లు. డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం: కోర్సు వ్యవధి ఆర్నెల్లు. డిగ్రీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

సర్టిఫికెట్ కోర్స్ ఆఫ్ జర్నలిజం: కోర్సు వ్యవధి మూడు నెలలు. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

- **ప్రాస్పెక్టస్, దరఖాస్తు ఫారం పొందేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 2
- **ఆన్‌లైన్ అడ్మిషన్ పొందేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **మొబైల్ నెం:** 98485 12767, 72860 13388
- **వెబ్‌సైట్:** www.apcj.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/3Y60EZ7లో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

40 రోజులు వైజాగ్‌లోనే...



సినీ నటుడు, తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ సోమవారం నగరానికి విచ్చేశారు. మధ్యాహ్నం 1.30 గంటలకు చెన్నై-విశాఖ విమానంలో ఇక్కడకు చేరుకున్న ఆయన నగరంలోకి వెళ్లారు. కాగా విమానాశ్రయంలో రజినీకాంత్ కనిపించడంతో పలువురు తమ సెల్‌ఫోన్‌లతో ఫొటోలు, వీడియోలు తీశారు. ఆయన ప్రస్తుతం నటిస్తున్న 'కూలీ' చిత్రం షూటింగ్ 40 రోజులపాటు నగరంలోని ఫిషింగ్ హార్బర్, తదితర ప్రాంతాల్లో జరగనున్నట్టు తెలిసింది.

గోపాలపట్నం (విశాఖపట్నం)

నటుడు దర్శన్‌కు జైల్లో రాచమర్యాదలు



హత్య కేసులో నిందితుడిగా ఉన్న కన్నడ సినీనటుడు దర్శన్‌కు కర్ణాటకలోని పరప్పన అగ్రహార జైల్లో రాచమర్యాదలు అందుతున్న ఫొటో, వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. రిమాండ్ ఖైదీగా ఉన్న దర్శన్‌తోపాటు మరో ముగ్గురు జైలు ఆవరణలోని ఒక పచ్చిక మైదానంలో ప్లాస్టిక్ కుర్చీల్లో కూర్చొని జల్సాగా గడుపుతున్నట్టు ఆ ఫొటోలో ఉంది. దర్శన్ ఒక చేతిలో కాఫీ కప్పు, మరో చేతిలో సిగరెట్ ఉన్నాయి. దర్శన్ ఎదురుగా ఆయన మేనేజర్‌తోపాటు ఈ కేసులో సహనిందితులుగా ఉన్న రౌడీషీటర్లు విల్సన్ గార్డెన్ నాగ, కుల్ల సీన కూర్చుని ఉన్నారు. జైల్లో ఖైదీలకు రాచమర్యాదలు అందుతున్నాయని విమర్శలు వెల్లువెత్తడంతో కర్ణాటక ప్రభుత్వం ఘటనపై విచారణకు ఆదేశించింది. ఏడుగురు జైలు అధికారులను సస్పెండ్ చేసింది.

కొంప ముంచిన వీడియోకాల్

రౌడీషీటర్ జానీ అలియాస్ జనార్దన్ కుమారుడు సత్య మే 7న మార్కెట్ ధర్మ అనే రౌడీషీటర్‌కు వీడియో కాల్ చేశాడు. తన సెల్ పక్కనే నటుడు దర్శన్ ఉన్నాడని చూపించి.. దర్శన్‌తో హాయ్ చెప్పించాడు. ఈ వీడియోను రికార్డు చేసుకున్న సత్య.. తన దర్జాను చాటుకునేందుకు కలాసిపాళ్యలోని కొందరికి షేర్ చేశాడు. అదే దర్శన్ కొంప ముంచింది. మరోవైపు సత్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

అభిమాని కుటుంబానికి మెగా సత్కారం



మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఆయన అభిమాని ఈశ్వరయ్య తిరుపతి నుంచి తిరుమల కొండ వరకూ పొర్లు దండాలు పెట్టుకుంటూ వెళ్లి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ విషయం చిరంజీవికి తెలిసి ఈశ్వరయ్యను, ఆయన కుటుంబ సభ్యులను హైదరాబాద్‌కు ప్రత్యేకంగా పిలిపించి, ఇంట్లో బట్టలు పెట్టి సత్కరించారు. ఈశ్వరయ్య కుటుంబానికి తను అండగా ఉంటానని మెగాస్టార్ మాట ఇచ్చారు. గతంలో కూడా ఈశ్వరయ్య తిరుపతి నుంచి హైదరాబాద్‌లోని మెగాస్టార్ ఇంటి వరకూ సైకిల్ యాత్ర నిర్వహించారు.

హీరోయిన్‌ను చూసి హీరో ఉరుకులు, పరుగులు



'హుషారు' చిత్రంతో ప్రేక్షకులను మెప్పించిన యువ కథానాయకుడు తేజస్ కంచర్ల నటించిన తాజా చిత్రం 'ఉరుకు పటేలా'. వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాలభాను నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 7న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను సోమవారం విడుదల చేవారు. ఈ సినిమా గురించి వివరిస్తూ 'పెళ్లి వయసు వచ్చినా హీరోకి పెళ్లి కాదు. కారణం అతనికి చదువు అబ్బలేదు. కానీ బాగా చదువుకున్న పిల్లనే పెళ్లి చేసుకోవాలని అనుకుంటాడు. అతని ఆశలకు తగ్గట్టే హీరోయిన్ అతన్ని ప్రేమిస్తుంది. ఎవరికీ నచ్చని హీరోను ఈ హీరోయిన్ ఎలా ప్రేమించిందా అన్నదే కథలో ట్విస్ట్. హీరోయిన్‌లోని మరో కోణం బయటకు రావడంతో హీరో భయపడి పారిపోవాలని అనుకుంటాడు. ఆమెని చూసి ఎందుకలా పారిపోవాలని అనుకున్నాడన్నది తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే' అని చెప్పారు దర్శకనిర్మాతలు.



ప్రియదర్శి హీరోగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'సారంగపాణి జాతకం'. సోమవారం ప్రియదర్శి పుట్టినరోజు కావడంతో సెట్‌లో వేడుక నిర్వహించారు. చాలా రోజుల తర్వాత పుట్టిన రోజుని సెలబ్రేట్ చేసుకుంటున్నాననీ, గొప్ప వ్యక్తుల మధ్య ఇలా జరుపుకోవడం ఆనందంగా ఉందని ప్రియదర్శి అన్నారు.

హిందువులేనా అని అడిగారు



కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేసుకునేందుకు మధురైలోని మీనాక్షి అమ్మవారి ఆలయానికి వెళ్లిన నటి నమిత దంపతులకు అవమానం ఎదురైంది. ప్రముఖుల దర్శన క్యూలైన్లో వెళ్ళిన వారిని ఆలయ సిబ్బంది అడ్డుకున్నారు. వీఐపీలు దర్శనానికి వస్తే వారి వివరాలను రిజిస్టర్‌లో పొందుపరచాల్సి ఉందని పేర్కొన్న సిబ్బంది.. 'మీరు హిందువేనా?' అని అడిగారు. తామిరువురమూ హిందువులమేనని, తమ కుమారుడికి శ్రీకృష్ణుడి పేరే పెట్టామని వారు వివరించారు. హిందువు అయితే నుదుట కుంకుమ పెట్టుకుని రావాలని ఆ సిబ్బంది నమితకు సూచించారు. ఆ మేరకు నమిత నుదుట కుంకుమ పెట్టుకుని ఆలయంలోకి వెళ్లి దైవదర్శనం చేసుకున్నారు. అనంతరం నమిత దంపతులు మీడియాతో మాట్లాడుతూ.. మీనాక్షి ఆలయ సిబ్బంది దురుసుగా వ్యవహరించారని, తాము హిందువులమని ధ్రువీకరించేందుకు సర్టిఫికేట్ అడిగారని తెలిపారు. నమిత మాట్లాడుతూ.. మొట్టమొదటిసారిగా తాను హిందూమతానికి చెందినదానిని నిరూపించుకోవాల్సిన అవసరం ఏర్పడిందని పేర్కొన్నారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

మీ టూ అంటూ ముందుకు వస్తున్న హీరోయిన్లు

● మలయాళ చిత్ర పరిశ్రమను కుదిపేస్తున్న జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్

ఒకప్పుడు మలయాళ చిత్ర పరిశ్రమ అంటేనే బూతు సినిమాలు.. చవకబారు సినిమాలు.. అనే తేలిక అభిప్రాయం ఉండేది. కేరళలోనే కాదు ఇతర భాషల్లోనూ మలయాళ చిత్రాలకు మంచి డిమాండ్ ఉండేది. భాష తెలియకపోయినా ఆ సినిమాల్లోని సీన్లకోసం ప్రేక్షకులు ఎగబడే వారు.. మమ్ముట్టి, మోహన్‌లాల్ వంటి హీరోలు ఉన్నా షకీలా లాంటి శృంగార తారలు అప్పట్లో ఒక వెలుగు వెలిగారు. వారి సినిమాల కంటే షకీలా సినిమాలే ఎక్కువ కలెక్ట్ చేసేవి. అయితే క్రమేపీ ఆ ముద్ర నుంచి బయటపడింది మలయాళ చిత్ర పరిశ్రమ. కొత్త రకం కథలతో.. సహజత్వం ఉట్టిపడే సినిమాలతో మిగతా అందరి దృష్టినీ ఆకర్షించగలిగింది. అంతే కాదు ప్రయోగాత్మక చిత్రాలు, కాన్సెప్ట్ ఓరియంటెడ్ ఫిల్మ్ కోసం మలయాళం సినిమాలే చూడాలి అనే స్థాయికి ఎదిగిందీ పరిశ్రమ. అవార్డులతో పాటు రివార్డులూ పొందింది. అయితే 2017లో జరిగిన ఓ సంఘటన మలయాళ చిత్ర పరిశ్రమ ప్రతిష్టను దెబ్బ తీసింది. తెలుగు వారికీ పరిచయమైన హీరోయిన్ భావనపై జరిగిన లైంగిక దాడి అందరినీ షాక్‌కు గురి చేసింది. ఈ దాడి దేశవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. అదే సమయంలో బాలీవుడ్ నటి తనుశ్రీ దత్తా ముందుకు వచ్చి, 2008లో నటుడు నానా పాటేకర్ తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని వెల్లడించి ఇండియాలో 'మీ టూ' ఉద్యమానికి నాంది పలికింది. ఇక అప్పటి నుంచి ఈ ఉద్యమం మిగిలిన చిత్ర పరిశ్రమలకూ పాకింది. లైంగిక వేధింపులను బట్టబయలు చేసింది. ఉప్పెనలా ఎగసిన ఈ ఉద్యమం అప్పట్లో చాలా మందికి నిద్ర పట్టకుండా చేసింది,

అప్పటి నివేదిక ఇప్పుడు వెలుగులోకి..

మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితులను ఏడేళ్ల పాటు పరిశీలించి, జస్టిస్ హేమ కమిటీ ఇటీవల ఇచ్చిన నివేదిక ఇప్పుడు ఆ పరిశ్రమను కుదిపేస్తోంది. మళ్లీ ధైర్యంగా హీరోయిన్లు ముందుకు వచ్చి, తమపై లైంగిక దాడికి ప్రయత్నించిన వారి చిట్టా బయట పెడుతున్నారు.

ఐదేళ్ల కెరీర్ కోల్పోయా



చిన్మయి

"ఉమెన్ ఇన్ సినిమా కలెక్టివ్ నిర్ణయం వల్లే ఈ కమిటీ నివేదిక సాధ్యమైంది. ఇప్పటివరకూ ఇలాంటిది ఏ పరిశ్రమలోనూ జరగలేదు. ప్రతీ ఇండస్ట్రీలో ఇలాంటి పరిస్థితులు ఉంటాయనేది బహిరంగ రహస్యం. సినీ పరిశ్రమలో లైంగిక వేధింపులు సాధ్యమని అందరూ భావిస్తుంటారు. ఇలాంటి ఘటన జరిగిందని చెప్పినా నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవడం లేదు. కొన్నేళ్ల పాటు కేసు నడుస్తూనే ఉంటుంది. రాజకీయ బలం, డబ్బు వల్ల ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిని శిక్షించడం కష్టంగా మారింది" అని చిన్మయి ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె గతాన్ని గుర్తుచేసుకున్నారు. "తమిళ చిత్ర పరిశ్రమకు చెందిన ఓ ప్రముఖ వ్యక్తి నాతో అభ్యంతరకరంగా ప్రవర్తించాడు. ఆయన గురించి బయటకు వచ్చి ధైర్యంగా మాట్లాడినందుకు నాకు ఆ పరిశ్రమలో వర్క్ లేకుండా చేశాడు. కాగా, విదేశాల్లో ఓ సంగీత కార్యక్రమం నిమిత్తం వెళ్లినప్పుడు సీనియర్ గీత రచయిత వైర ముత్తు తనని వేధింపులకు గురి చేశారని 'మీటూ' ఉద్యమ సమయంలో ఆమె కామెంట్స్ చేశారు. ఆయన చెప్పిన మాటలు విననందుకు తన కెరీర్ పైనే దెబ్బ కొట్టారని చిన్మయి ఆరోపించారు. ఈ క్రమంలోనే తమిళ పరిశ్రమ చిన్మయిని దాదాపు ఐదేళ్లు బ్యాన్ చేసింది. నిషేధం తర్వాత ఆమె 'లియో' చిత్రంలో త్రిష పాత్రకు డబ్బింగ్ చెప్పారు.

నాతో అసభ్యంగా ప్రవర్తించాడు



శ్రీలేఖ



రంజిత్ బాలకృష్ణన్

బెంగాలీ నటి శ్రీలేఖ మిత్ర మలయాళ చిత్ర దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై ఆరోపణలు చేశారు. 2009లో రంజిత్ దర్శకత్వం వహించిన "పలేరి మాణిక్యం: ఒరు పతిర కోలపతకతింటే కథ" సినిమా ఆడిషన్ సందర్భంగా తనతో అసభ్యంగా ప్రవర్తించినట్లు వెల్లడించారు. "నాకు సినిమా అవకాశం ఇస్తానని, సినిమా గురించి చర్చించేందు దర్శకుడు రంజిత్ నన్ను హోటల్ గదికి రమ్మన్నారు. గదిలోకి వెళ్లిన తర్వాత నాతో అసభ్యంగా ప్రవర్తించడంతో షాక్ గురై అక్కడ నుంచి బయటకు వచ్చేశాను" అని ఆరోపించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ కేరళ చలనచిత్ర మండలి అధ్యక్షుడి పదవికి రాజీనామా చేశారు. "నటి శ్రీలేఖ నాపై చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదు. నిజానికి ఈ విషయంలో అసలు బాధితుడ్ని నేను. నాపై వెల్లువెత్తుతున్న ఆరోపణల నేపథ్యంలో నేను ఈ పదవిలో ఉండటం సముచితం కాదు. నాపై వస్తున్న ఆరోపణలను నేను లీగల్‌గా ఎదుర్కొని.. నా తప్పు లేదని నిరూపించుకుంటా" అని ఓ టెలివిజన్ చానల్‌కు పంపిన ఆడియో రికార్డ్‌లో పేర్కొన్నారు.

వేధింపులు ఎదుర్కొన్నా



మీను మునీర్

మరో మలయాళి నటి మీను మునీర్ తనకు జరిగిన ఓ చేదు అనుభవాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. "మలయాళ పరిశ్రమకు చెందిన నటులు ముఖేశ్, మణియన్‌పిళ్ల రాజు, ఇడవేల బాబు, జయసూర్య, ప్రొడక్షన్ కంట్రోలర్ నోబల్, విచు వల్ల నేను ఎంతో మానసిక క్షోభ అనుభవించాను. వారు అసభ్యపదజాలంతో నన్ను దూషించేవారు. షూటింగ్ సమయంలో జయసూర్య నా వెనుకనుంచి బలవంతంగా హత్తుకుని, ముద్దుపెట్టుకున్నాడు. ఇవన్నీ తట్టుకోలేక నేను మలయాళ ఇండస్ట్రీని వదిలి చెన్నైకు వచ్చేశా. నాకీ విషయంలో న్యాయం జరగాలని కోరుకుంటున్నాను. వారు చేసిన పనికి తగిన శిక్ష పడాలి" అని పేర్కొన్నారు.

నా దృష్టిలో సిద్ధిఖీ.. ఓ క్రిమినల్



సిద్ధిఖీ



రేవతి సంపత్

మలయాళ నటుడు సిద్ధిఖీ తనతో అసభ్యంగా ప్రవర్తించారని మలయాళ నటి రేవతి సంపత్ ఆరోపణలు చేశారు. "కొన్నేళ్ల క్రితం నటుడు సిద్ధిఖీ.. ఓ సినిమా కోసం నన్ను కలవాలని ఫేస్‌బుక్‌లో మెసేజ్ పెట్టారు. కూతురనే అర్థం వచ్చేలా ఆయన పిలవడంతో నేను ఆయనని సంప్రదించా. ఆయన నన్ను శారీరకంగా, మానసికంగా బాధించారు. నా దృష్టిలో ఆయనొక క్రిమినల్. దీని వల్ల నా కెరీర్ కూడా దెబ్బతింది. ఇప్పటికి ఈ విషయంపై మాట్లాడ్డానికి ధైర్యం వచ్చింది" అని పేర్కొన్నారు. ఈ ఆరోపణల నేపథ్యంలో సిద్ధిఖీ మలయాళ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ పదవికి రాజీనామా చేశారు.

ఇండస్ట్రీలో లేకుండా చేస్తానన్నారు



గీతా విజయన్



తులసీ దాస్

నటి గీతా విజయన్ మలయాళ చిత్ర దర్శకుడు తులసీ దాస్‌పై ఆరోపణలు చేశారు. "చంచట్టం' సినిమా షూటింగ్‌లో తులసీ దాస్ నాతో అసభ్యంగా ప్రవర్తించారు. నేనుండే రూమ్ తలుపు కొడుతుండేవాడు. నేను ఆ పద్ధతిని తప్పుపట్టినందుకు షూటింగ్‌లో ఆయన నాకు డైలాగులు చెప్పేవారు కాదు. ఇండస్ట్రీలో లేకుండా చేస్తానని బెదిరించేవారు" అని గీత ఆరోపించారు.

ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు తప్పుకోవాలి



పృథ్వీరాజ్

హేమ కమిటీ నివేదికపై.. మలయాళ పరిశ్రమలోని ప్రముఖులపై వెల్లువెత్తుతున్న ఆరోపణలపై నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ స్పందించారు. "అధికారంలో ఉండి ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు పదవుల నుంచి తప్పుకోవాలి. నిందితులపై విచారణ జరిపి.. దోషులని తేలితే కఠినంగా శిక్షించాలి. ఈ నివేదికలో వెల్లడించిన అంశాలు నాకు ఆశ్చర్యం కలిగించలేదు. ఎందుకంటే పరిశ్రమలో మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించడం మన కనీస బాధ్యత. అందుకు నేను ముందుంటా. అయితే అది నా ఒక్కడి బాధ్యత కాదు. అందరూ ఈ పద్ధతిని అనుసరించాలి" అని పేర్కొన్నారు.

జస్టిస్ హేమ కమిటీ... నివేదిక

2017లో నటి భావనపై కొందరు దుండగులు కారులో లైంగిక దాడికి పాల్పడిన సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. కారులో ఆమెను పలు చోట్లకు తిప్పుతూ దుండగులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆ ఘటనలో మలయాళ అగ్రహీరో దిలీప్ కీలక నిందితుడు. ఆ సంఘటన తర్వాత మలయాళ పరిశ్రమలో మహిళలపై వేధింపులకు సంబంధించి నివేదిక ఇవ్వాలని 2019లో అప్పటి ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీని ఏర్పాటు చేసింది. మాజీ హైకోర్టు న్యాయమూర్తి కే.హేమ ఈ కమిటీకి చైర్ పర్సన్‌గా ఉన్నారు. సీనియర్ నటి శారద, ఐఏఎస్ అధికారిణి కేబీ వల్సల కుమారి సభ్యులుగా ఉన్నారు. కమిటీ తమ నివేదికను నాలుగేళ్ల క్రితమే ప్రభుత్వానికి సమర్పించినా, సున్నితమైన అంశాలున్నాయనే సాకుతో అందులోని విషయాలు బయటక రాకుండా ఇన్నాళ్లూ ప్రభుత్వం తొక్కిపట్టింది. సమాచార హక్కు చట్టం కింద బయటకు వచ్చిన ఈ నివేదికలో పలు విస్తుగొలిపే విషయాలు బయటకు వచ్చాయి. నివేదిక ఇచ్చి నాలుగేళ్లయినా చర్యలు శూన్యమన్న ప్రతిపక్షాల విమర్శల నేపథ్యంలో కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. మహిళలపై వేధింపులను అడ్డుకునేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని హామీనిచ్చారు. ఈ మేరకు ఓ స్పెషల్ కమిటీని కేరళ ప్రభుత్వం నియమించింది. ఈ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)కు ఓ ఐ.ఏ.ఎస్ అధికారిణి ప్రాతినిధ్యం వహించనున్నారు.

పేదవాడికి అన్నం పెట్టేది టీడీపీయే..

● రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి/టెక్కలి: పేదవాడికి రూ.5కే కడుపునిండా అన్నం పెట్టేది టీడీపీయేనని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం కోటబొమ్మాళి, టెక్కలిల్లో అన్నక్యాంటీన్లను పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా పేదలకు అండగా ఉండేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మూసివేసిన అన్న క్యాంటీన్లను మళ్లీ టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పునఃప్రారంభిస్తున్నామన్నారు. రాష్ట్రంలో నెల రోజుల్లో మరో 120 అన్న క్యాంటీన్లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివర ప్రసాద్, టీడీపీ మండలాల అధ్యక్షులు బోయిన రమేష్, బగాది శేషగిరి, మాజీ ఎంపీపీలు వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, దేవాది సింహాద్రమ్మ, కణితి కిరణ్‌కుమార్, హనుమంతు రామకృష్ణ, కోళ్ల లవ కుమార్, కామేసు, లాడి శ్రీనివాస్, మామిడి రాము, తదితరులు పాల్గొన్నారు. ● కోటబొమ్మాళిలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌కు బిర్లంగి గ్రామానికి చెందిన డాక్టర్ బలగ మురళి రూ.లక్ష విరాళాన్ని మంత్రికి అందజేశారు. అలాగే జామి చలపతిరావు రూ.10వేలను అందించారు. వీరిని మంత్రి అచ్చెన్నాయుడు అభినందించారు.



కోటబొమ్మాళి: అన్న క్యాంటీన్‌లో భోజనాలు వడ్డిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

గ్రామీణ ప్రాంతాలకు పల్లె వెలుగు

టెక్కలి: గ్రామీణ ప్రాంతాల్లో అన్ని రూట్లలో అవసరాన్ని బట్టి పల్లెవెలుగు బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తామని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం స్థానిక ఇందిరా గాంధీ కూడలిలో పలు ఆర్టీసీ సర్వీసులకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెక్కలి-కొత్తపల్లి-విశాఖ రూట్‌లో ఎక్స్‌ప్రెస్ సర్వీసు నడపాలని ప్రజారవాణా అధికారి ఎ.విజయ్ కుమార్, డీఎం శ్రీనివాసరావులకు సూచించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

'ఎత్తిపోతల'ను ప్రారంభానికి సిద్ధం చేయండి

కోటబొమ్మాళి: నియోజకవర్గంలో పాడైన ఎత్తిపోతల పథకాలను బాగుచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. సోమవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసే ఎత్తిపోతల పథకాలను గత ఐదేళ్లుగా నిర్వహణ లేకపోవడంతో పరికరాలు చోరీకి గురయ్యాయన్నారు. ఇప్పుడు వాటికి మరమ్మతులు చేసేందుకు నిధులు సమకూరుస్తామని, వాటిని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

కూర్మ గ్రామాభివృద్ధికి రూ.50 వేల విరాళం

హిరమండలం/ పాతపట్నం: వైదిక గ్రామమైన కూర్మ గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు రూ.50 వేలు విరాళాన్ని సోమవారం అందించారు. హిరమండలం మండలం కిట్టాలపాడు గ్రామ సమీపంలో ఉన్న కూర్మ గ్రామంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శబ్ద కాలుష్యంలేని గ్రామంలో 200 ఏళ్ల కిందటి సనాతన సంప్రదాయాలను ఆచరిస్తూ జీవనం సాగించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కూర్మ గ్రామానికి భక్తుల తాకిడి ఎక్కువవడంతో ట్రాఫిక్ జామ్ అయింది. ఈ వేడుకల్లో సుమారు 5 వేలకు పైగా భక్తులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని సేవలో..

జలుమూరు: శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వరస్వామిని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు, దేవదాయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆయనకు అర్చకులు శేషవస్త్రం అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు నారాయణమూర్తి, సింహాచలం, వెంకటాచలం పాల్గొన్నారు.



శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో హారతి ఇస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నరసన్నపేట: ద్విచక్రవాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సీఐ జె.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మెయిన్ రోడ్డుపై వాహనాలను తనిఖీ చేసి ధ్రువపత్రాలను పరిశీలించారు. మైనర్ల వాహనాలను నడపరాదన్నారు. అలాగే దాబాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి శస్త్రచికిత్సకు 75 మంది ఎంపిక

వజ్రపుకొత్తూరు: అనంతగిరి పంచాయతీ వెంకటాపురం పీహెచ్‌సీ ఆవరణలో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ వైద్యులు 105 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 75 మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు కంటివైద్యులు సీహెచ్ గిరిజ, రామారావు తెలిపారు. ఈ శిబిరాన్ని మాజీ సర్పంచ్ మరడ భాస్కరరెడ్డి ప్రారంభించారు. అంతకు ముందు అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జి.జోగారావు, టీడీపీ నాయకులు వి.భుజంగ రావు, నీలపు కృష్ణారావు, పోలయ్య, టి.రామయ్య తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న నాయకులు, వైద్య సిబ్బంది

యోగా శిక్షకులకు దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: తెంబూరు హోమియో వైద్యశాలలో యోగా శిక్షకులుగా పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హోమియో వైద్యాధికారి ఎస్.ఉమాగౌరి తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. యోగాలో పీజీ డిగ్రీ డిప్లొమా చేసి, అనుభవమున్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఆసక్తి, అర్హులైన వారు ఈనెల 30న ఉదయం 11 గంటల్లోగా దరఖాస్తులను వైద్య శాలలో అందించాలన్నారు. శిక్షకులకు గంటకు రూ.250 చొప్పున ఇస్తారన్నారు. పురుష శిక్షకులకు 32 గంటలు, మహిళా శిక్షకులకు 20 గంటలు ప్రతీ నెలా గౌరవవేతనం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9441589618 నెంబరులో సంప్రదించాలని ఆమె సూచించారు.

'కంచరాన'కు జాతీయ కవితా పురస్కారం

టెక్కలి: కడప జిల్లా ప్రొద్దుటూరులో యువత సాహితీ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సాహితీ సదస్సులో నందిగాం మండలం బడగాం గ్రామానికి చెందిన కంచరాన భుజంగరావుకు పల్లా జాతీయ కవితా పురస్కారాన్ని ప్రదానం చేశారు. భుజంగరావు రచించిన 'నీటిగింజలు' పంట కవితా సంపుటికి ఈ అవార్డు వచ్చింది. యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి ఎస్.ఈశ్వరరెడ్డి, ప్రముఖ కవి ఉమ్మడి శెట్టి ఈ కావ్యాన్ని పరిచయం చేశారు. జాతీయ స్థాయి పురస్కారాన్ని నిర్వాహకులు డాక్టర్ పల్లా కృష్ణ తదితరులు అందించి అభినందించారు.



భుజంగరావును సత్కరిస్తున్న సంస్థ నిర్వాహకులు

కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి

జలుమూరు: వాతావరణంలో మార్పుల కారణంగా కాచి చల్లార్చిన నీటిని వాడాలని జలుమూరు పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి చిన్నరాజులు కోరారు. దరివాడ గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్‌గా జ్వరాలు వచ్చే అవకాశమున్నందున పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వేడి పదార్థాలను మాత్రమే తినాలన్నారు. మలవిసర్జన తరువాత, భోజనం ముందు చేతులు సబ్బుతో కడుక్కోవాలన్నారు. తాగునీటి బావుల్లో క్లోరినేషన్ చేయించారు. కార్యక్రమంలో ఆప్తాలమిస్ట్ రాజు, ఏఎన్ఎంలు సత్యవతి, నాగమణి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

పిచ్చి కుక్క కరిచి ఐదుగురికి గాయాలు

నరసన్నపేట: ఉర్లాం గ్రామంలో సోమవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసి ఐదుగురిని గాయపరిచింది. గ్రామానికి చెందిన దీర్ఘాశి చిట్టెమ్మ, కె.పుణ్యవతి, భారతమ్మ, మహేష్, డొబ్బల మహేష్‌లను వేర్వేరు సమయాల్లో గాయపరిచింది. వీరందరికీ ఉర్లాం పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం నరసన్నపేట సామాజిక ఆసుపత్రికి తరలించారు.

మేజర్ పంచాయతీ ఈవోగా ద్రాక్షాయణి

నరసన్నపేట: నరసన్నపేట మేజర్ పంచాయతీ ఈవోగా ద్రాక్షాయణిని నియమిస్తూ కలెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బొరిగివలస పంచాయతీ గ్రేడ్-2 కార్యదర్శిగా పనిచేస్తున్న ఈమెకు పదోన్నతిపై గ్రేడ్-1 కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.



ఉట్టి కొడుతున్న యువకులు

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

పలాస: పలాస నియోజకవర్గం శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకలకు అధ్యక్షత వహించిన రాష్ట్ర బీసీ సంఘ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ.. మన సంప్రదాయం, కళలు మరిచి పోకూడదన్న ఉద్దేశంతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మాజీ మంత్రి శివాజీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు భక్తిమార్గంలో పయనించాలని, శ్రీకృష్ణుని జీవితం అందరికీ ఆదర్శం కావాలన్నారు. ఈ సందర్భంగా చేపట్టిన జానపద, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, థింసా నృత్యం, సంగిడి రాళ్ల పోటీ, ఉట్టికొట్టడం తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ దంపతులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో సంఘ నేతలు కొర్రాయి బాలకృష్ణ యాదవ్, బద్రి కూర్మారావు, బద్రి గోపాల్, దడియాల నర్సింహులు, టీడీపీ పలాస సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, నేతలు గురిటి సూర్యనారాయణ, సప్ప నవీన్, బడ్డ నాగరాజు, అంబటి కృష్ణమూర్తి, డొక్కరి శంకర్, జోగ మల్లి పాల్గొన్నారు.



మాజీ మంత్రి గౌతు శివాజీ దంపతులను సత్కరిస్తున్న శ్రీకృష్ణ యాదవసంఘం నాయకులు

సత్యసాయి విద్యావిహార్‌లో..

పలాసరూరల్: రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధా, గోపికల వేషధారణలో అలరించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న మల్లా జ్యోతి, సత్యనారాయణ చిన్నారులకు బహుమతులు అంద జేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, శ్రీను, శరత్, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.



పలాసరూరల్: సత్యసాయి విద్యావిహార్‌లో శ్రీకృష్ణ, రాధా, గోపికల వేషధారణలతో చిన్నారులు, విద్యార్థులు

మదర్‌థెరీసా సేవలు మార్గదర్శకం



కొరసవాడ హైస్కూల్‌లో మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న దృశ్యం

పాతపట్నం: భారతరత్న మదర్ థెరీసా అందించిన సేవలు మార్గదర్శకమని పలువురు వక్తలు అన్నారు. కొరసవాడ జడ్పీ హైస్కూల్ ఆవరణలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో థెరీసా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సుమారు 45 ఏళ్ల పాటు మిషనరీస్ ఆఫ్ చారిటీస్ ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా అభాగ్యులకు సేవలందించి ఘన కీర్తిని పొందారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.సింహాచలం, సారవకోట ఎంఈవో ఎంవీ రమణ, వివిధ పాఠశాలల హెచ్ఎంలు గణపతి, శ్రీరాములు, బి.అనిల్ కుమార్, పాస్టర్ ఎస్.ఫిలిప్, బి.మీనాకుమారి పాల్గొన్నారు.



నరసన్నపేట: వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

వృద్ధాశ్రమంలో..

నరసన్నపేట: గొట్టిపల్లిలోని మదర్ థెరీసా జయంతిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పేదలకు, అభాగ్యులకు ఆమె అందించిన సేవలు ఆదర్శనీయమని పలువురు సభ్యులు అన్నారు. అనంతరం వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీచేశారు.

బీజేపీ బలోపేతానికి కృషి

నందిగాం: గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, దీనికి సభ్యత్వ నమోదు కీలకమని బీజేపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ పూడి తిరుపతిరావు అన్నారు. సోమవారం నందిగాంలో సభ్యత్వ నమోదుపై టెక్కలి నియోజకవర్గ కన్వీనర్ అట్టాడ రవిబాబ్జీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ.. సెప్టెంబరు ఒకటి నుంచి ప్రారంభ మయ్యే సభ్యత్వ నమోదు ప్రక్రియలో భాగంగా మండలస్థాయిలో 4వ తేదీన శ్రీకారం చుడతామన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి తద్వారా వారిని ఆకర్షితుల్ని చేసి పార్టీలో చేర్పించాలని సూచించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పుల్లటి దుర్గారావు, ఓబీసీ మోర్చా జిల్లా ప్రతినిధి కె.జగన్నాథరావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.లక్ష్మీ నారాయణ, రాష్ట్ర కన్వీనర్ వై.కామరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నేతలు

ప్రజాహితం కోరే పార్టీ జనసేన

పోలాకి: ప్రజాహితం కోరే పార్టీ జనసేన అని, ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన గ్రామసభల ద్వారా ఇది వెల్లడైందని ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు మెట్ట వైకుంఠరావు, వై.నందేసు, చంద్రశేఖర్, వెంకటి, వరప్రసాద్ అన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వంతో పాటు బీమా సదుపాయం కల్పిస్తోందన్నారు. గ్రామసభల ద్వారా ప్రజల అవసరాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రణాళికలు తయారు చేయాలని ప్రణాళికలు తయా రుచేయాలని పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించడం శుభ సూచిక మన్నారు. సెప్టెంబరు 2న పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. 3,650 క్రియాశీలక సభ్యత్వాలు చేపట్టి నరసన్నపేట నియోజకవర్గ నాయకులు మంచి పేరు పొందారన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాతపెన్షన్ విధానమే సమస్యకు పరిష్కారం

నరసన్నపేట: పాత పెన్షన్ విధానమే ఉద్యోగుల సమస్యకు ఏకైక పరిష్కారమని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి, అధ్యక్షుడు ఎల్.బాబూరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీం పేరుతో నూతన పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టిందని, దానిని అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. పాత పెన్షన్ విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి ఎస్ఏ-1 పరీక్షలు

నరసన్నపేట: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఎస్ఏ-1 పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభించి వచ్చే నెల 4వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంఈవో ఉప్పాడ శాంతారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం వచ్చిన ప్రశ్నపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు ప్రశ్నపత్రాలను తీసుకోవాలని, టైం టేబుల్ ప్రకారం పరీక్షలను నిర్వహించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను నమోదు చేయాలని సూచించారు.

దోమల నివారణకు చర్యలు

నరసన్నపేట: పట్టణంలో దోమల బెడద ఎక్కువగా ఉందని ఇటీవల గ్రామసభలో టీడీపీ నాయకులు ఫిర్యాదు చేయడంతో పంచాయతీ అధికారులు స్పందించారు. సోమవారం దోమల నివారణకు గాను ఫాగింగ్ చేపట్టారు. ఇదిలా ఉండగా మారుతీనగర్, శ్రీరామనగర్, సూరజ్‌నగర్, కామేశ్వరినగర్, శివానగర్ కాలనీ, రాజీవ్‌నగర్, పచోరీ కాలనీల్లో ఫాగింగ్ చేయాలని ఆయా కాలనీల వాసులు కోరుతున్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి



రక్తదాతను అభినందిస్తున్న కార్మిక సంఘ నేతలు, ట్రస్ట్ సభ్యులు

పలాస: రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని క్యాజూ, రైస్‌మిల్లుల కార్మిక సంఘం అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి అన్నారు. ఆ నలుగురు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కార్మిక భవన్‌లో రక్తదానశిబిరం నిర్వహించారు. టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షణలో నలుగురు మహిళలతో పాటు 31 మంది రక్తదానంచేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు చింతాడ సుధీర్ కుమార్, చిన్నంనాయుడు, ఆ నలుగురు సంస్థ నిర్వాహకులు సానా ఈశ్వరరావు, టెంక తేజేశ్వరరావు, రాము, భీమారావు, సింహాచలం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జలుమూరు: బుడితి సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11 కేవీలో కొత్త బ్రేకర్ ఏర్పాటు చేయడంలో భాగంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో అచ్యుతాపురం, తిమడాం, పర్లాం, శ్రీముఖలింగం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా..

జలుమూరు (సారవకోట): ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా అధిక లోడు ఫీడర్లు విడగొట్టేందుకు 33/11 బుడితి సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని ఫీడర్లు షట్ డౌన్ చేసి మంగళవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు బుడితి, అవలింగి చీడిపూడి, బద్రి, గుమ్మపాడు, అక్కివలస, బైదలాపురం, కిన్నెరవాడ, తొగిరి, వడ్డినవలస, గోపాలపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

స్నేహితుడి వైద్య చికిత్సకు సాయం

సంతబొమ్మాళి: భావనపాడు గ్రామానికి చెందిన బి.సోమేశ్వరరావు బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడు తుండగా మర్రిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1998-99 చదువుకున్న సహచరులు సోమవారం ఆర్థిక సాయం అందించారు. వైద్య చికిత్స నిమిత్తం రూ.45,270 నగదును ఆయన కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వాడరేవు రవికుమార్, బి.బాలరాజు, కె.రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు కృష్ణాష్టమి వేడుకలు

టెక్కలి: పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకుడు సీహెచ్ రమణా చార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని తరించాలని కోరారు.

రోడ్డుకు ఇరువైపులా తుప్పల తొలగింపు

వజ్రపుకొత్తూరు: మండలం కేంద్రం నుంచి నువ్వలరేవు వైపు ఉన్న ఆర్అండ్‌బీ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుప్పలు, చెట్ల కొమ్మలను ఆర్అండ్‌బీ అధికారుల ఆదేశాలతో సిబ్బంది తొలగించారు. ఈ మార్గంలో చెట్లు పెరిగిపోవడంతో వాహనాల రాకపోకల సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా వారు స్పందించి తొలగించినట్లు జనసేన పలాస సమన్వయకర్త డా.వి.దుర్గారావు, వంశీ కృష్ణ తదితరులు తెలిపారు.

787 పశువులకు టీకాలు

కోటబొమ్మాళి: తర్లిపేట, ఊడికలపాడు, కిష్టుపురం, బలరాంపురం, కస్తూరిపాడు, జర్జంగి తదితర గ్రామాల్లో సోమవారం పశువైద్యాధికారి లకినేని కిరణ్‌కుమార్ 787 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా లు వేశారు. పశుసంవర్ధక శాఖ ఏడీ ఎం. లోకనాథం పర్యవేక్షణలో చేపట్టారు. పశు వైద్యాధికారి ప్రజ్ఞచైతన్య పాల్గొన్నారు.

ఉపాధి గ్రామసభ

మెళియాపుట్టి: పెద్ద లక్ష్మీపురంలో ఉపాధి హామీ గ్రామ సభను సోమవారం నిర్వహించారు. సోషల్ ఆడిట్‌లో భాగంగా వివిధ పనులకు సంబంధించి ఆడిట్ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉదయకుమార్, ఏపీవో రవి, ఎస్పార్పీ రామారావు, డీఆర్పీ రాజు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీకాకుళం-2 బ్రాంచ్ తరఫున ఇస్తున్న పబ్లిక్ నోటీసు. శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం సబ్-డి., శ్రీకాకుళం మండలం, సింగుపురం పంచాయతీ కాపురస్తులైన శ్రీ / శ్రీమతి బరాటం ఉదయ శంకర్ S/o. బరాటం మురళీకృష్ణ వీరి ప్రాపర్టీని ష్యూరిటీగా తీసుకొని వారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించాలనుకున్నారు. ... ఈ దిగువ షెడ్యూలులో వివరించిన ఆస్తిని తాకట్టుగా పెట్టుటకు ప్రతిపాదించియున్నారు. ... ఈ నోటీసు ప్రచురించబడిన ఏడు దినములలోగా వారి యొక్క అభ్యంతరములను నాకుగాని, నా క్లయింటుకుగాని తెలియపరచవలెను. ... యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు: శ్రీకాకుళం జిల్లా, సబ్-డి., శ్రీకాకుళం మండలం, సింగుపురం పంచాయతీ, సింగుపురం రెవెన్యూ గ్రామం లెక్క దాఖలా గలిగి ... శ్రీకాకుళం మండలం తహశీల్దార్ వారు S.R. No. 254/2023 గా మంజూరు చేసిన ఎండార్స్‌మెంట్ ప్రకారముగా సర్వే నెంబర్ 466-2ఎ గలిగి ... ఖాళీ స్థలంకు కొలతలు, హద్దులు వివరం: తూర్పు పడమరలకు 74.5 అడుగులు (22.69 మీటర్లు), ఉత్తర దక్షిణాలకు తూర్పు వైపు 62 అడుగులు (18.88 మీటర్లు), ఉత్తర దక్షిణాలకు పడమర వైపు 47.5 అడుగులు (14.46 మీటర్లు) కొలతలు అనగా 453.208 చ.గజాలు లేక 378.941 చ.మీ. విస్తీర్ణం గల స్థలంకు హద్దులు : తూర్పు: ... పడమర: ఎన్.హెచ్.-16 రోడ్డు, ఉత్తరం: ...

టి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్
డోర్ నెం.11-6-59, కొల్లా వారి వీధి, శ్రీకాకుళం.
సెల్: 9247315759

సందడిగా కృష్ణాష్టమి

జిల్లా వ్యాప్తంగా సోమవారం కృష్ణాష్టమిని భక్తులు సందడిగా నిర్వహించారు. వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారుల వేష ధారణలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలతో మహిళలు అలరించారు. ఉట్టికొట్టే వేడుకల్లో చిన్నారులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

\- ఆంధ్రజ్యోతి బృందం


సోంపేట: సామూహిక కుంకుమార్చన..


పొందూరు: కృష్ణుడి ప్రతిమలను ఊరేగిస్తున్న భక్తులు


ఇచ్ఛాపురం: ఉట్టి కొడుతున్న చిన్నారులు


ఆమదాలవలస: మెట్టక్కివలస సత్యసాయి మందిరంలో..


రణస్థలం: ఇస్కాన్ ఆలయంలో ఎంపీ కలిశెట్టి..


పలాస రూరల్: పెద్ద బ్రాహ్మణ వీధిలో..


సంతబొమ్మాళి: గొదలాంలో గో పూజ..


కంచిలి: కోలాటం ఆడుతున్న మహిళలు


మందస: రాజగోపాలస్వామి ఆలయంలో..


పోలాకి: వనవిష్ణుపురంలో కృష్ణదేవరాయుల విగ్రహం వద్ద..


నరసన్నపేట: బాలికల వసతి గృహంలో ఉట్టికొడుతున్న విద్యార్థినులు


నందిగాం: పోతులూరు రాధాకృష్ణాలయంలో..

తల్లి మందలించిందని.. కాలువలో దూకి

● వంశధారలో యువకుడి గల్లంతు


గల్లంతైన దుర్గాప్రసాద్

హిరమండలం: మేజర్ పంచాయతీ మైత్రీ కాలనీకి చెందిన జోగి దుర్గాప్రసాద్ (24) వంశధార కుడి కాలువలో దూకి గల్లంతయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. దుర్గాప్రసాద్ తరుచూ తల్లితో గొడవపడుతుండేవాడు, తల్లి సావిత్రమ్మ సోమవారం మందలించింది. దీంతో క్షణికావేశంతో పెద్దకోరాడ వీధి సమీపంలో ఉన్న వంశధార కుడి కాలువలో దూకాడు. దీనిని గమనించిన స్థానికులు అతడిని కాపాడేందుకు ప్రయత్నించినా., ఫలితం లేక పోయింది. కాలువలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గల్లంతయ్యాడు. వెంటనే స్థానికులు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వడంతో కొత్తూరు సీఐ చింతాడ ప్రసాద్, ఎస్ఐ నారాయణస్వామి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కాలువలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండంతో గాలింపు చర్యలకు వీలులేకుండా పోయింది. దీంతో వంశధార అధికారులకు సమాచారం అందించి కాలువ గేట్లు మూసి వేయించారు. కొత్తూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. రాత్రి కావడంతో మంగళవారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు. దుర్గా ప్రసాద్ తండ్రి కొన్నేళ్ల కిందటే చనిపోగా తల్లి సావిత్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని సీఐ ప్రసాద్ తెలిపారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

శ్రీకాకుళం క్రైం: ద్విచక్రవాహనం ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు గాయపడిన ఘటనలో నగరంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రణస్థలం మండలం దేరసాం గ్రామానికి చెందిర కడగళ్ల నారాయణ నాయుడు సోమవారం ఉదయం ట్రిపుల్ ఐటీలో చదువుతున్న తన మేనకోడలు బొంతి యశోధను రాజమండ్రి పంపించేందుకు శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌కి ద్విచక్రవాహనంపై బయలు దేరాడు. సరిగ్గా కొత్త బ్రిడ్జి మీద ఉండగా ఎదురుగా ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై అతివేగంగా వచ్చి ఢీ కొట్టాడు. దీంతో నారాయణ, యశోద పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సాయంతో 108 వాహనంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ ఎస్ఐ వరదరాజులు కేసు నమోదు చేశారు. అయితే ప్రమాదానికి కారణమైన వారు అక్కడే ఉన్న సీసీ కెమెరాలో చిక్కినట్టు తెలుస్తోంది.

నకిలీ జీఎస్టీ అధికారుల కేసులో ముమ్మర దర్యాప్తు

శ్రీకాకుళం క్రైం: నకిలీ జీఎస్టీ అధికారుల పేరుతో కొందరు ఓ వ్యాపారిని బెదిరించి రెండు లక్షల రూపాయలు వసూలు చేసిన కేసులో డీఎస్పీ ఆధ్వర్యంలో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. ప్రస్తుతం ఇది నగరంలో హాట్‌టాపిక్‌గా మారింది. అటు జీఎస్టీ అధికారులు, ఇటు పోలీసులు ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఎన్నడూ లేనివిధంగా ముగ్గురు వ్యక్తులు జీఎస్టీ అధికారులమంటూ రూ.రెండు లక్షలు మోసానికి పాల్పడి, కుల దూషణ ఆరోపణలతో ఆ ముగ్గురిపై టూటౌన్ పోలీసులు ఎస్సీఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఎస్పీ ఆదేశాల మేరకు కాశీబుగ్గ డీఎస్పీ శ్రీనివాసరావు దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా తమ పైనే కేసు పెడతారా అంటూ ఆ ముగ్గురు టూటౌన్ పోలీసులపై ఇటీవల దురుసుగా ప్రవర్తించడంతో వీరి ప్రవర్తనపై ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సైతం సీరియస్‌గా ఉన్నారు. ఈ కేసులో ఉన్న ఆ ముగ్గురు వ్యక్తులు రాజకీయ నాయకులను ఆశ్రయించగా.. ఇటువంటి వాటికి తమ మద్దతు ఉండదని వారు తేల్చేసినట్టు భోగట్టా. రెండో పట్టణ పోలీసులు సైతం తొలుత కేసు లేకుండా రాజీ చేసుకునేందుకు సహకరించారని, బాధితుడు ఎస్పీని ఆశ్రయిస్తాననడంతో కేసు కట్టారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కేసులో బాధితుడైన రాయివీధికి చెందిన ఎస్సీ కులానికి చెందిన రాయపురెడ్డి చంద్రశేఖర్ స్వీట్ షాపు నిర్వహిస్తూ తన ఇంటి ఖర్చుల కోసం ఉంచుకున్న సొమ్మును ఆ ముగ్గురు వ్యక్తులు బెదిరించి కాజేశారని, కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేయడంతో డీఎస్పీ శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు. అలాగే నకిలీ జీఎస్టీ అధికారుల మంటూ లంచం తీసుకున్నారని తెలుసుకున్న జీఎస్టీ అధికారి రాణి మోహన్ దీనిపై విచారణ జరిపించారు. వ్యాపారిని విచారించి అతడు తెలిపిన వివరాలను జీఎస్టీ కమిషనర్‌కు నివేదిక అందించినట్టు సమాచారం. అలాగే వ్యాపారులెవరూ నకిలీ జీఎస్టీ అధికారుల చేతులో మోసపోవద్దని ఆమె స్పష్టం చేశారు.

ఇసుక తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

ఎచ్చెర్ల: బొంతలకోడూరు పంచాయతీ రుప్పపేటకు సమీపంలో సముద్రపు దిబ్బల వద్ద సోమవారం ఇసుకను తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. చల్ల అర్జున్, గురువు సూర్యనారాయణలపై కేసు నమోదు చేయడంతో పాటు జేసీబీ, ట్రాక్టర్‌లను సీజ్ చేసినట్టు ఆయన చెప్పారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరిపై..

పాతపట్నం: స్థానిక బస్టాండ్ వద్ద సోమవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఒడిశా మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ మహమ్మద్ యాశిన్ తెలిపారు. ద్విచక్ర వాహనంపై 11 మద్యం బాటిళ్ల తరలిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి విలువ రూ.2,130 ఉంటుందన్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

టెక్కలి: బొప్పాయిపురం పంచాయతీ చల్లపేట గ్రామానికి చెందిన సీహెచ్ మల్లేసు సోమవారం మధ్యాహ్నం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కుటుంబసభ్యులు హుటాహుటిన జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అయితే మల్లేసు పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేసి తరలించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో మల్లేసు ఈ అఘాయిత్యానికి పాల్పడినట్టు గ్రామస్థులు తెలిపారు.

రెండు ఇసుక లారీలు సీజ్


రణస్థలం: కొచ్చెర్ల నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక లారీలను జేఆర్ పురం పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొచ్చెర్ల తీరంలో సముద్రపు ఇసుక కందివలస గెడ్డ ఇసుకలో కల్తీ చేసి అక్రమంగా రెండ లారీలతో విశాఖ తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రెండు లారీలను సీజ్ చేశారు. ఈ అక్రమ ఇసుక తరలింపునకు పాల్పడిన ముద్దా శ్రీను, లోడగల వెంకటేష్, ఆర్.అచ్చెయ్యమ్మతో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు జేఆర్ పురం ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

నిస్వార్థ సేవకు ప్రతిరూపం మదర్ థెరిసా


థెరిసా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నిస్వార్థ సేవకు ప్రతిరూపంగా మదర్ థెరిసా నిలుస్తారని అరసవల్లి లైన్స్ క్లబ్ అధ్యక్షుడు వావిలపల్లి జగన్నాథం నాయుడు అన్నారు. మదర్ థెరీసా జయంతి శ్రీకాకుళం నగరంలోని గాంధీ మందిరంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహ దాతలు డాక్టర్ చింతాడ కృష్ణ మోహన్, హర్షవల్లి లైన్స్ క్లబ్ అధ్యక్షుడు వావిలిపల్లి జగన్నాథంనాయుడు, లైన్స్‌క్లబ్ చైర్మన్ హారికా ప్రసాద్‌తో పాటు గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు మదర్ థెరిసా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళుర్పించారు. మానవసేవలోనే జీవన పరమార్థం దాగి ఉందని చాటి చెప్పిన ఆమె స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగించాలన్నారు. అవదాన పండితులు పైడి హరనాథరావు మాస్టర్ మదర్ థెరిసా గొప్పతనాన్ని గేయం రూపంలో కీర్తించారు. కార్యక్రమంలో గాంధీ మందిరం కమిటీ ప్రతినిధులు విష్ణుమూర్తి, నటు కుల మోహన్, డాబాన దేవభూషణ్, పందిరి అప్పారావు, పొన్నాడ రవికుమార్, గుత్తు చిన్నారావు, తర్లా అప్పలనాయుడు ఉన్నారు.

పిన్నింటికి సేవారత్న అవార్డు


అవార్డు అందుకుంటున్న దృశ్యం

రణస్థలం: రణస్థలం సర్పంచ్ పిన్నింటి భానోజీనాయుడుకు సేవా రత్న అవార్డు దక్కింది. గత కొన్ని సంవత్సరాలుగా పిన్నింటి భానోజీనాయుడు చేపడుతున్న సేవా కార్యక్రమాలన గుర్తించి చేయూత సోషన్ సర్వీస్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ చిన్నార్లా చేతుల మీదుగా సోమవారం విశాఖలో ఈ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు.

సహారా బాధితులకు న్యాయం చేయాలి


మాట్లాడుతున్న సంఘ నాయకుడు సత్తిరాజు

పొందూరు: సహారా ఇండియాలో ఇన్వెస్ట్ చేసిన మోసపోయిన రెండు తెలుగు రాష్ట్రాల్లోని బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయం చేయాలని ఆ సంఘ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షురాలు మార్క్ సుజాత డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన ఉత్తరాంధ్ర సహారా ఇండియా ఏజెంట్ల సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 12 ఏళ్ల పూర్తయిన డిపాజిట్లకు చెల్లింపులు జరగకపోవడంతో ఏజంట్లపై ఒత్తిడి పెరుగుతోందన్నారు. రెండు రాష్ట్రాల్లో రూ.50 వేల కోట్ల డిపాజిట్లు నిలిచిపోయాయన్నారు. ఖాతాదారుల ఒత్తిడి కారణంగా అమాయకులైన ఏజెంట్లు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని, దీనికారణంగా వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించకపోతే తమ ఉద్యమాన్ని ఢిల్లీ వరకు తీసుకువెళతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బి.సత్యనారాయణ, బైపల్లి సత్తిరాజు, గుడ్ల అన్నాజీ వందలాది మంది సహారా ఏజంట్లు పాల్గొన్నారు.

సేవే లక్ష్యంగా ముందుకు సాగాలి

ఇచ్ఛాపురం: ప్రతీ జేసీఐ సభ్యుడు సేవే లక్ష్యంగా ముందుకు సాగాలని జేసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు జీఎఫ్‌జీ గురుదిత్ సింగ్ షామే అన్నారు. సోమవారం పట్టణంలో గల జీపీసీ క్లబ్‌ను సందర్శించారు. అనంతరం స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో క్లబ్ అధ్యక్షులు షన్ముకరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ చేస్తున్న పలు సేవా కార్యక్రమాలను గూర్చి కొనియాడారు. క్లబ్ తరుపున 500వ మొక్కను సురింగి రాజా మైదానంలో నాటారు. చిందబరేశ్వర, రత్తకన్న వెళ్లే మార్గంలో ప్రయాణికుల కోసం నిర్మించిన బస్ షెల్టర్‌ను జాతీయ ఉపాధ్యక్షుడు ప్రారంభించారు. కార్యక్రమంలో జోన్ అధ్యక్ష, ఉపాధ్యాయులు, సురేష్, ఉపాధ్యక్షుడు సురేష్, సాయిసుదీర్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా కంపెనీ పేలుడు ఘటనలో మరణించిన పైడి రాజశేఖర్ కుటుంబాన్ని ఎమ్మెల్యే కూన రవికుమార్ సోమవారం పరామర్శించారు. వంజంగి వెళ్లిన ఎమ్మెల్యే.. రాజశేఖర్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రభుత్వ సహాయం ఇతర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ మండలంలోని వివిధ గ్రామాల్లో పలు కారణాలతో మృత్యువాత పడిన మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే రవికుమార్ పరామర్శించారు. వంజంగి మాజీ సర్పంచ్ ఎండ అప్పలనాయుడు, ఎస్ఆర్‌సీ పేట సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతిరావు, పార్టీ నాయకులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఏర్పాటు

సోంపేట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడేందుకు ఇచ్ఛాపురం నియోజకవర్గ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. జైభీమ్ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా గొలియా ప్రకాష్, ఉపాధ్యక్షుడిగా ఇప్పిలి చిరంజీవి, సలహాదారులుగా దిష్క గోవిందరావు, నగిరి మోహనరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో చల్లా దేవరాజు, నూతలపాటి బాబూరావు, డిండగి వాసు తదితరులు పాల్గొన్నారు.

నృత్యకారిణులకు జ్ఞాన సరస్వతి అవార్డులు

ఇచ్ఛాపురం: జాతీయ ఆచార్య పంచనాన పురస్కారం-2024 అవార్డులకు పట్టణానికి చెందిన స్వేచ్ఛా నృత్య తరంగిణి చిన్నారులు జోషిక, తేజశ్రీ, ఉపాసన, యశ్విత, సింగమయి, అనుశ్రీ, శ్రావ్య, లస్య, వర్షిణి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం సనాతన సాంస్కృతిక సంస్థ, జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానం భాసర సంయుక్త ఆధ్వర్యంలో నృత్యోత్సవం వేడుకలు భాసర సన్నిధిలోని కోటి గాజులు మండపంలో జరిగాయి. ఈ ప్రదర్శనలో చిన్నారులు ఆకట్టుకుని అవార్డులకు ఎంపికయ్యారు. అకాడమి మేనేజర్ గోవింద్, మంగి దాలమ్మ పాల్గొన్నారు

తైక్వాండో పోటీలకు ఎంపికలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

శ్రీకాకుళం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించారు. జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇక్కడి టౌన్‌హాల్ వేదికగా సోమవారం జరిగిన పోటీలను రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుపతిలోని నేషనల్ సాంస్కృత యూనివర్సిటీలోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 31, సెప్టెంబరు 1వ తేదీల్లో జరగనున్న ఆస్మిత ఉమెన్స్ తైక్వాండో లీగ్ పోటీలు జరుగుతాయన్నారు. అలాగే తిరుపతిలో రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ జట్టు పాల్గొంటారన్నారు. పోటీలను మజ్జి గౌతమ్, తైక్వాండో నవీన్, లక్ష్మణ్, జోగిపాటి వంశీ, ఎన్.శేఖర్, హరి పర్యవేక్షణలో జరిగింది.

క్రీడా దినోత్సవాలు ప్రారంభం

శ్రీకాకుళం స్పోర్ట్స్: మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్న జాతీయ క్రీడాదినోత్సవాలు సోమవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా కోడి రామ్మూర్తి స్టేడియంలో హాస్టల్ విద్యార్థులతో ప్రతిజ్ఞ నిర్వహించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, సెట్‌శ్రీ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు సీఈవో ప్రసాదరావు తెలిపారు. ఈ నెల 27న క్రీడా పోటీలు, 28న వివిధ ప్రభుత్వ విద్యా సంస్థల్లో క్రీడా పోటీలు, 29న ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగులతో ర్యాలీ, 30, 31తేదీల్లో విద్యాసంస్థల్లో క్రీడంశాలపై క్విజ్, వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. తొలిరోజు కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్, సెట్‌శ్రీ మేనేజర్ అప్పలనాయుడు, పర్యటక శాఖ అధికారి ఎన్.నారాయణ రావు, శిక్షకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కార్మికుల భద్రతకు చర్యలు తీసుకోవాలి

అరసవల్లి: పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం జిల్లా ఆఫీసు బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. పరిశ్రమల యజమానులు సరైన భద్రతా చర్యలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తరచూ ప్రమాదాలు జరిగి కార్మికుల ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరుతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా కంపెనీలు నడుపుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వడంతో యాజమాన్యాలు కార్మికుల భద్రతను గాలికి వదిలేశాయన్నారు. ప్రమాదాల నివారణకు ఉన్నత స్థాయి కమిటీ వేయాలని, ఇందులో కార్మిక సంఘాల నాయకులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. పైడి భీమవరంలో ఈఎస్ఐ డిస్పెన్సరీని 24 గంటలు నడపాలని, పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమించాలని కోరారు. వచ్చే నెల 10న విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు నిర్వహించే ఆందోళనలో అన్ని సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఆదినారాయణమూర్తి, కె.సూరయ్య, కార్యదర్శులు అల్లు మహాలక్ష్మి, ఎన్‌వీ రమణ, ఎన్.గణపతి, హెచ్.ఈశ్వరరావు, బి.ఉత్తర పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ఉంగటూరు ఎమ్మెల్యే


స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని ఉంగటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఎమ్మెల్యే పి.ధర్మ రాజు సోమవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి ప్రసాదాలు, జ్ఞాపికలను ఆలయ ఈవో డీఎల్‌వీ రమేష్‌బాబు వారికి అందజేశారు.

శ్రీముఖలింగేశ్వరుని..

జలుమూరు: అలాగే శ్రీముఖలింగేశ్వరస్వామి వారిని ఉంగటూరు జనసేన ఎమ్మెల్యే పి.ధర్మరాజు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేదమంత్రాలతోను పూజలు చేయించారు. స్వామి వారి శేషవస్త్రాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు సింహాచలం, నారాయణమూర్తి, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో అడ్డగోలు నియమకాలు రద్దు చేయాలి

శ్రీకాకుళం అర్బన్: ఎచ్చెర్లలోన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో మాజీ వీసీ చేపట్టిన అడ్డగోలు నియామకాలను రద్దు చేయాలని దళిత ఆదివాసీ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. వర్సిటీలో చేపట్టిన నియామకాల్లో ఎస్సీలపై కుల వివక్ష చూపిస్తున్న రిజిస్ట్రార్ వైఖరి సరికాదని, యూజీసీ నిబంధనల ప్రకారం మూడేళ్లకు మించి పదవిలో ఉండకూడదని, కానీ అర్హతకు మించి పదవులు కట్టబెట్టారని వారు ఆరోపించారు. యూనివర్సిటీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై తక్షణం విచారించాలని డిమాండ్ చేశారు. ఈ భాగోతాలన్నీ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లామన్నారు. సమావేశంలో సంఘ నాయకులు బి.అప్పారావు, డి.గణేష్, ధనరాజ్, బి.ప్రభాకర్, రమణ, రాంబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం వ్యాపారం ప్రభుత్వ విధానం కాదు

ఆమదాలవలస: మద్యం వ్యాపారం ప్రభుత్వ విధానం కాకూడదని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. కొత్తవలస, తొగరాం, ఎన్‌టి వాడ, చీమలవలస, నెల్లిపర్తి గ్రామాల్లో పర్యటించి ఇటీవల మరణించిన టీడీపీ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం మద్యం వ్యాపారం చేసి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టి జేబులు నింపుకుందని ఆరోపించారు. ప్రభుత్వాలు పరిపాలన చేయాలే తప్ప వ్యాపారాలు చేయకూడదన్నారు. నాసిరకం మద్యం అమ్మి ప్రజల ప్రాణాలను తీసివేశారని మండిపడ్డారు. అక్టోబర్ నుంచి తమ ప్రభుత్వం మద్యం పాలసీలు మారుస్తుందన్నారు. నాసిరకం బ్రాండ్లకు చెల్లుచీటి ఉంటుందన్నారు. గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. పార్టీ నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, గురుబిల్లి మోహన్‌రావు, తులసీరావు, మల్లేశ్వరరావు, జనార్దనరావు, సర్పంచ్ సనపల చెల్లన్నాయుడు, నర్సింగరావు, శెట్టి పద్మ, శెట్టి నరసింగరావు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

గెలిచాక తొలిసారి స్వగ్రామానికి..

పొందూరు: పెనుబర్తి గ్రామంలో సోమవారం రాత్రి ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కూన రవికుమార్ మొదటిసారిగా తన స్వగ్రామమైన పెనుబర్తి గ్రామానికి వచ్చారు. దీంతో గ్రామస్థులు టీడీపీ అభిమానులు రవికుమార్‌కు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో తనపై చూపుతున్న అభిమానానికి రవికుమార్ కృతజ్ఞలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, నాయకులు కూన సత్యనారాయణ, అన్నెపు రాము, బలగ శంకరభాస్కర్, చింతాడ కృష్ణ వాసుదేవరావు, మండలనాయకులు కార్యకర్తలు అభిమానులు భారీసంఖ్యలో పాల్గొన్నారు..

ఆదిత్యాలయంలో ప్రత్యేక పూజలు

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవాలయంలో సోమవారం శ్రావణ బహుల అష్టమి, శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని ఆలయ అనివెట్టి మండలంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జన్మాష్టమి ఉత్సవాలు సోమవారం నుంచి సెప్టెంబరు 3వ తేదీ వరకు జరుగుతాయన్నారు.

నేడు హుండీల లెక్కింపు

ఆగస్టు 27వ తేదీ మంగళవారం ఆలయ అనివెట్టి మండపంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ ఇప్పిలి జోగిసన్యాసిరావు, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, దేవదాయశాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు, పాలకమండలి సభ్యుల సమక్షంలో స్వామివారి హుండీల లెక్కింపు జరుగుతుందని ఈవో తెలిపారు.

రేషన్ డీలర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

అరసవల్లి: జిల్లా రేషన్ డీలర్ల సంఘం ఎన్నికలు నగరంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో సోమవారం జరిగాయి. జిల్లా సంఘం అధ్యక్షుడిగా ఆరంగి రామారావు, కార్యదర్శిగా నక్కా రవికుమార్, ఉపాధ్యక్షునిగా పట్నాన కోటేశ్వరరావు, కోశాధికారిగా కొత్తకోట నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రానున్న జనరల్ బాడీ మీటింగ్‌లో మిగతా కమిటీని ఎన్నుకోనున్నట్టు తెలిపారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

ఎచ్చెర్ల: పరీద్‌పేట గ్రామంలో ఇటీవల జరిగిన దాడిలో మృతిచెందిన కూన ప్రసాద్ కుటుంబానికి అండగా ఉంటామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పరీద్‌పేటలోని కుటుంబ సభ్యులను సోమవారం ఆయన మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో హత్యారాజకీయాలు పెరిగిపోయాయన్నారు. ఈ కేసులో బాధ్యులైనవారిని అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ స్థానిక సర్పంచ్ కొత్తకోట పూర్ణచంద్రరావు, నేతలు సనపల నారాయణరావు, ముద్దాడ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్ కుటుంబాన్ని ఆదుకోవాలి

పొందూరు: అచ్యుతాపురం కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన హంస ప్రశాంత్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఈ మేరకు పొందురులోని ప్రశాంత్ కుటుంబాన్ని సోమవారం స్పీకర్ పరామర్శించారు. ప్రశాంత్ భార్య జ్యోతి, తల్లి సత్యవతిలను ఓదార్చారు. ప్రశాంత్ కుమార్తెలను చదివించే బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు కె.రమణమూర్తి, జి.నాగరాజు, బి.సునీల్, రమణమ్మ, గిరి తదితరులు ఉన్నారు.

రాజారావుకు కలాం అవార్డు

పొందూరు: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వావిలపల్లి రాజారావుకు అబ్దుల్ కలాం అవార్డు వరించింది. మండలానికి చెందిన ప్రముఖ రచయిత రాజారావును విశాఖలోని పౌరగ్రంథాలంలో డేస్ప్రింగ్, ఇంటర్నేషనల్ యూనివర్సిటీ, చేయూత సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంస్థలు సంయుక్తంగా కలాం అవార్డును ప్రదానం చేశారు. సాహితీరంగంలో అందించిన సేవలకుగాను ఈ అవార్డును ప్రదానం చేశారు.

కబడ్డీ కార్యవర్గ ఎన్నిక సరికాదు

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లా కబడ్డీ అసోసియేషన్ పేరుతో నూతనంగా ఏర్పాటు చేసిన కార్యవర్గాన్ని ఖండిస్తున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఎ.చిరంజీవిరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మా సంఘం 2014 నుంచి గుర్తింపు పొందిన సంఘం అని, నాటి నుంచి నేటి వరకు మేము కొనసాగిస్తున్నామన్నారు. నూతన క్రీడా పాలసీ విధానం ప్రకారం ప్రతి సంవత్సరం అధికారికంగా ప్రభుత్వానికి నివేదికలను సమర్పిస్తూ వస్తున్నామన్నారు. ఈ మధ్య కబడ్డీ పట్ల ఆదరణ పెరగడంతో కొత్త అసోసియేషన్లు పుట్టుకొస్తున్నాయని ఆరోపించారు.

పారిశుధ్య పనుల్లో యువత

కంచిలి: మండల కేంద్రంలోని బలియాపుట్టుగ కాలనీలో పారిశుధ్యం పనులను స్థానిక యువకులు సోమవారం చేపట్టారు. కాలనీకి వెళ్లేదారిలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానికులంతా అధికారులు, పాలకుల దృష్టికి తీసుకువచ్చారు. అయినా వారెవరూ పట్టించుకోకపోవడంతో గ్రామ యువకులు పూనా రవికుమార్, గుడియా మిట్టు, తెంబూరు చిన్నాలు చెత్తను సేకరించి, కాల్చివేశారు. సీజనల్ వ్యాధులు, జ్వరాలు ప్రబలుతున్నా పట్టించుకోకపోవడంతో తామే చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టి, వీధుల్లో బ్లీచింగ్ చల్లించాలని కోరారు.

బూరగాంలో ప్రత్యేక డ్రైవ్

కంచిలి: సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు సోమవారం బూరగాం గ్రామంలో కంచిలి పీహెచ్‌సీ వైద్యులు హరిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. బావుల వద్ద, కొళాయిల వద్ద బ్లీచింగ్ చేయించారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది కమలాభాయి, చంద్రశేఖర్‌లతోపాటు టీడీపీ నాయకులు బొడ్డు అప్పారావు పాల్గొని సేవలందించారు.

ఆ భూములు యజమానులకు అప్పగించాలి

అరసవల్లి: అన్యాక్రాంతమైన భూములను నిజమైన యజమానులకు అప్పగించాలని, 22-ఏ అడ్డుపెట్టుకుని స్వాహా చేసిన భూములను తిరిగి బాధితులకు అందజేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర సుందరలాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని క్రాంతి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా నాయకులు, అధికారుల చేతివాటం కారణంగా అమాయకులు ఎందరో తమ భూములను కోల్పోయారన్నారు. రాజకీయ నాయకుల భూదాహానికి గురైన వారికి తక్షణ న్యాయం అందించి, తిరిగి వారికి వారి భూములను అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. భూ కుంభకోణాలపై వేసిన సిట్ కేసుల్లో దర్యాప్తును వేగవంత చేయాలని కోరారు. ఈ నెల 28న విజయవాడలో నిర్వహించే భూ బాధితుల సదస్సుకు జిల్లా నలుమూలల నుంచి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, కార్యవర్గసభ్యులు కొన్న శ్రీనివాస్, సీపీఐ నాయకులు నజీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.